పాకాల ఆయకట్టు మొత్తానికి సాగునీరు

అధికారులు, రైతులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

- వరి పూర్తి సాగుకు చర్యలు
- కాల్వల మరమ్మతులు చేపట్టాలి
- సమీక్షలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట, డిసెంబర్ 18: వచ్చే యాసంగిలో పాకాల సరస్సు పరిధిలో పూర్తి ఆయకట్టు సాగుకు నీరు అందిస్తామని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో సోమవారం ఆయన నీటిపారుదల, రెవెన్యూ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి తైబందీ నిర్ణయంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గ రైతులకు పెద్ద దిక్కుగా ఉన్న పాకాల సరస్సు కింద రైతులు పూర్తిగా వరిసాగు చేసుకోవాలని సూచించారు. పాకాల సరస్సులో ప్రస్తుతం 22.9 అడుగుల నీటిమట్టం ఉందన్నారు. దీంతోపాటు దేవాదుల పైపులైన్ ద్వారా సరస్సులోని నీటిని పంపింగ్ చేసి పూర్తిస్థాయిలో సాగునీటిని అందించాలని అధికారులను కోరారు. పాకాల చెరువులోకి నీరు విడుదల చేయాలని సీఈ విజయ్‌భాస్కర్‌తో చర్చించినట్లు చెప్పారు. పాకాల సరస్సు కింద ఉన్న ఐదు ప్రధాన కాల్వలైన సంగెం, తుంగబంధం, మాటు వీరారం, పసునూరు, జాలుబంధం కాల్వలకు సాగునీరు విడుదల చేయాలని నిర్ణయించినట్లు వివరించారు. సాధ్యాసాధ్యాలపై అందరితో పూర్తిగా చర్చించిన తర్వాతే ఈ నిర్ణయానికి వచ్చినట్లు వెల్లడించారు. పూర్తి ఆయకట్టుకు నీరందిస్తే.. ప్రతి రోజూ 450 క్యూసెక్కుల నీటిని సరస్సు నుంచి విడుదల చేయాల్సి ఉంటుందన్నారు. దేవాదుల పైపులైన్ ద్వారా రోజూ రెండు మోటర్లు నడిస్తే 300 క్యూసెక్కుల నీరు సరస్సులోకి చేరుతుందన్నారు. తద్వారా పూర్తి స్థాయిలో ఆయకట్టుకు నీరందించడం సాధ్యమన్నారు. ఆయకట్టు కాల్వల ద్వారా నీటి వృథాను అరికట్టేందుకు మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. జనవరి 5 నుంచి కాల్వలకు సరస్సు ద్వారా నీటిని విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సమీక్షలో ఆర్డీవో కృష్ణవేణి, నీటిపారుదల శాఖ ఈఈ సల్మాన్‌రాజ్, డీఈ రమేశ్‌బాబు, ఏఈలు, తహసీల్దార్, ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, పాకాల ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సంస్థపై సీఎం ప్రత్యేక దృష్టి

ఆర్టీసీ సంస్థపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని ఎమ్మెల్యే దొంతి అన్నారు. నర్సంపేటలో ఆర్టీసీ కార్మికులు తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో దొంతిని కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు త్వరలో శుభవార్త వింటారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తక్కళ్లపల్లి రవీందర్‌రావు, కందికొండ మోహన్, బొడిగ రాజు, రమాబాయి, బదావత్ కాలు, మంద రాజు, బూర ప్రవీణ్‌కుమార్, ఎన్ఎస్‌రావు, నర్సయ్య, పీఎన్‌స్వామి, నామాల అశోక్, రంగయ్య, రాజు పాల్గొన్నారు.

మాదన్నపేట చెరువు తైబందీ ఖరారు

నర్సంపేటరూరల్, డిసెంబర్ 18: మాదన్నపేట పెద్ద చెరువు యాసంగి తైబందీని ఎట్టకేలకు ఖరారు చేశారు. చిమ్మినేని బుర్ర వరకు 220 ఎకరాలు, నెక్కొండ రోడ్ సంద్ర కాల్వ నుంచి పుట్టల పంపు కల్వర్టు వరకు 630 ఎకరాలు, పెద్ద కాల్వ మొత్తం ఆయకట్టు 850 ఎకరాలకు తైబందీని అధికారులు ఖరా రు చేశారు. మొత్తం 1700 ఎకరాలకు సాగునీరు అందించేందుకు నిర్ణయించారు. దుబ్బ కాల్వ మొత్తం 850 ఎకరాలను క్రాఫ్ హాలిడేగా ప్రకటించారు. పెద్ద కాల్వ తూమును జనవరి 1న తీయనున్నట్లు ఐబీ అధికారులు తెలిపారు.

నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

మృతుల కుటుంబ సభ్యులకు పెద్ది పరామర్శ

నర్సంపేట/నెక్కొండ, డిసెంబర్ 18: పట్టణానికి చెందిన ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ గద్దల అశోక్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సోమవారం గ్రామానికి చేరుకొని అశోక్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజినీకిషన్, కౌన్సిలర్ దార్ల రమాదేవి, నాయకులు పాల్గొన్నారు. అలాగే, నెక్కొండ మాజీ ఎంపీపీ, మాజీ జడ్పీటీసీ తేజావత్ వాలునాయక్ సతీమణి బాజీ మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను పెద్ది పరామర్శించారు. ఆయన వెంట నెక్కొండ సొసైటీ చైర్మన్ రాము, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సూరయ్య, సొసైటీ మాజీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు చల్లా చెన్నకేశవరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుంటుక సోమయ్య ఉన్నారు.

యువజనోత్సవాలను జయప్రదం చేయాలి

శాయంపేట, డిసెంబర్ 18: జిల్లాస్థాయి యువజనోత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీడీవో అమంచ కృష్ణమూర్తి తెలిపారు. యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో హనుమకొండ, కాజీపేట, ఐనవోలు, హసన్‌పర్తి, వేలేరు, ధర్మసాగర్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, కమలాపూర్, పరకాల, నడికూడ, దామెర, ఆత్మకూరు, శాయంపేట మండలాలకు చెందిన 15 నుంచి 29 ఏండ్ల మధ్య వయస్సు ఉన్న యువతీ యువకుల్లో దాగి ఉన్న కళలను వెలికితీసి ప్రోత్సహించేందుకు జిల్లాస్థాయి యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాంస్కృతిక విభాగంలో జానపద నృత్య బృందం (గరిష్ఠంగా పది మంది), జానపద నృత్యం వ్యక్తిగత/ఒంటరి (గరిష్ఠంగా ఐదుగురు), జానపద గేయ బృందం (గరిష్ఠంగా పది మంది), జానపద గేయం వ్యక్తిగతం(గరిష్ఠంగా ఐదుగురు), జీవన నైపుణ్యాల భాగంలో కథారచన, పోస్టర్ తయారీ, డిక్లేమేషన్, పొటోగ్రఫీ అంశాల్లో ఈ నెల 21న హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని హ్యాండ్‌బాల్ కోర్టులో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తిగల యువతీ యువకులు హనుమకొండలోని యువజన, క్రీడల కార్యాలయంలో ఈ నెల 20లోగా సంప్రదించాలని ఎంపీడీవో కోరారు.

మరియపురం అభివృద్ధే ధ్యేయం: సర్పంచ్

గీసుగొండ, డిసెంబర్ 18: మరియపురం గ్రామ అభివృద్ధే తన ధ్యేయమని సర్పంచ్ అల్లం బాలిరెడ్డి అన్నారు. సోమవారం తన పుట్టినరోజు సందర్భంగా 2022-2023 సంవత్సరంలో తనకు వచ్చి సర్పంచ్ వేతనం రూ. 78 వేల చెక్కును గ్రామైక్య సంఘానికి అందజేశారు. అలాగే, గ్రామంలోని 17 మంది పేద పిల్లల చదువు కోసం రూ. 1.86 లక్షల చెక్కులను సెయింట్ జాన్స్ పాఠశాల ప్రిన్సిపాల్‌కు అందించారు. గత ఐదేళ్లుగా ప్రభుత్వం నుంచి వస్తున్న గౌరవ వేతనాన్ని గ్రామైక్య సంఘాలకు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి స్వప్న, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

'ఓటరు జాబితా సమగ్రంగా ఉండాలి'

దామెర, డిసెంబర్ 18: మండల కేంద్రంలోని రైతు వేదికలో ఓటరు నమోదులో భాగంగా సోమవారం బీఎల్‌వోలకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మీదేవి మాట్లాడుతూ బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో ఓటరు జాబితాను పరిశీలించి, నూతన ఓటర్ల నమోదుతోపాటు జాబితాలో తప్పులుంటే సరిచేయాలన్నారు. శిబిరంలో ఏఎస్‌వో హైమావతి, గిర్దావర్లు భాస్కర్‌రెడ్డి, సంపత్‌రావు పాల్గొన్నారు.

'రాజీనామాను ఆమోదించాలి'

ఖిలావరంగల్, డిసెంబర్ 18: ది వరంగల్ జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శికి తాను చేసిన రాజీనామాను ఆమోదించడం లేదని ఎండీ అప్జల్‌మియా ఒక ప్రకటనలో ఆరోపించారు. అనారోగ్య సమస్యలతో రాజీనామా చేశానని, ఇప్పటికే వరంగల్ లారీ సప్లయర్స్, చాంబర్ ఆఫ్ కామర్స్ నేతలకు కూడా చెప్పానని పేర్కొన్నారు. అసోసియేషన్‌లో అవకతవకలు జరిగితే తనకు సంబంధం లేదని స్పష్టం చేశారు.

వరంగల్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీవో వాసుచంద్ర

పోచమ్మమైదాన్, డిసెంబర్ 18: వరంగల్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో ఎం.వాసుచంద్ర సోమవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అలాగే, కార్యాలయంలోని ఆధార్ సెంటర్, చాంబర్‌లో రికార్డులను తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న సేవలను తహసీల్దార్ ఇక్బాల్‌ను అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఖానాపురం, డిసెంబర్ 18: అశోక్‌నగర్ కేజీబీవీలో అసిస్టెంట్ కుక్ పోస్ట్ నియామకానికి అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో రత్నమాల తెలిపారు. 7వ తరగతిలో ఉత్తీర్ణులై వారు ఈ నెల 22లోగా ఎమ్మార్సీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న స్థానికులు

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం

గీసుగొండ, డిసెంబర్ 18: మొగిలిచెర్ల జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులు పాక రమేశ్‌బాబు, కొండేటి ప్రభాకర్‌ను తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం అనిత మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సాధారణమన్నారు. అంకితభావంతో పని చేసే ఉపాధ్యాయులకు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ఆడెపు శ్రీధర్, ఎస్ఎంసీ చైర్మన్ నర్సింగరావు, డీసీసీబీ డైరెక్టర్ దొంగల రమేశ్, స్థానికుడు రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవార్డు పొందిన టీచర్‌కు..

ఖానాపురం: మంగళవారిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు గుగులోత్ సుధాకర్ ఇటీవల కాకతీయ మహోనంది పురస్కారం అందుకున్నాడు. సోమవారం పాఠశాల ఆవరణలో తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను ఘనంగా సత్కరించారు. హెచ్ఎం మంజుల, ఉపాధ్యాయులు కీర్య, రమేశ్, రాజు, శ్రీను, సురేందర్, లక్ష్మి పాల్గొన్నారు.

లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

నల్లబెల్లి, డిసెంబర్ 18: మతిస్థిమితం లేని మహిళపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రూరల్ సీఐ పుల్యాల కిషన్ కథనం ప్రకారం.. దస్తగిరిపల్లెకి చెందిన కడివెండి కేదారి అదే గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని మహిళపై ఈ నెల 15న లైంగికదాడి చేశాడు. గమనించిన ఆమె సోదరుడు అతడిని పట్టుకునే ప్రయత్నం చేయగా పరారయ్యాడు. బాధితురాలిని ఆమె సోదరుడు సోమవారం స్టేషన్‌కు తీసుకొచ్చి ఫిర్యాదు చేసినట్లు సీఐ చెప్పారు. దర్యాప్తు చేపట్టి నిందితుడిని పట్టుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. సీఐ వెంట ఎస్సై నైనాల నగేశ్ ఉన్నారు.

కనుల పండువగా స్వామివారి కల్యాణం

కరీమాబాద్: స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న శ్రీరామశర్మ

కరీమాబాద్/నెక్కొండ/ఖిలావరంగల్/కాశీబుగ్గ/గీసుగొండ, డిసెంబర్ 18: ఉర్సులోని నాగేశ్వరస్వామి దేవస్థానంలో వల్లీ-దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని సోమవారం ఆలయ కార్యనిర్వాహణాధికారి కమల ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు శ్రీరామశర్మ వేదమంత్రోచ్చారణ మధ్య శాస్త్రోక్తంగా కల్యాణ తంతు గావించారు. వందలాది జంటలు కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశాయి. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పోశాల పద్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, నెక్కొండలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు బి.వి.యన్.శాస్త్రి ఆధ్వర్యంలో వేదపండితులు బూరుగుపల్లి శ్రవణ్‌శాస్త్రి, అనుముల గోపాల కృష్ణమూర్తి, డింగిరి శేషపవన్ కుమార్ వేదమంత్రోచ్చారణల మధ్య కల్యాణ క్రతువును గావించారు. వరంగల్ శివనగర్ సీతారామచంద్రస్వామి ఆలయంలోని సుబ్రహ్మణ్యస్వామికి పూజలు, సామూహికంగా పంచామృతాలతో అభిషేకం చేశారు. కాశీబుగ్గ ఓసిటీ రోడ్డులోని సీతారామాంజనేయ హరిహరపుత్ర అయ్యప్పస్వామి శివపంచాయతన ఓంకారేశ్వర నాగేంద్రస్వామి ఆలయంలో సుబ్రమణ్యస్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కల్యాణంలో పాల్గొన్నారు. గీసుగొండ మండలం ఊకల్‌లోని సుబ్రమణేశ్వరస్వామి కల్యాణాన్ని అర్చకులు సుదర్శనచార్యులు, శ్రీహర్షచార్యులు వేడుకగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బాబురావు, సర్పంచ్ పాల్గొన్నారు.

ఘనంగా అమ్మానాన్న, గురువు పద్యార్చన

కేజీబీవీ ఆవరణలో పద్యార్చన చేస్తున్న విద్యార్థులు

చెన్నారావుపేట/నడికూడ, డిసెంబర్ 18: మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో తానా మహాసభల ఆధ్వర్యంలో సోమవారం అమ్మానాన్న, గురువు పద్యార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్తర అమెరికాలోని తానా సంఘం వందేవిశ్వభారత్ పేరుతో చిగురుమళ్ల శ్రీనివాస్ వంద దేశాల్లో నిర్వహిస్తున్న శాంతి సద్భావన యాత్రలో భాగంగా తానా అధ్యక్షుడు నిరంజన్ శృంగవరపు, జయశేఖర్ అమ్మానాన్న, గురువు శతక పద్యార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలోని 167 మంది విద్యార్థులు సామూహిక గానం చేశారు. కార్యక్రమంలో టీచర్లు తేజస్విని, రాజ్యలక్ష్మి, రజిత, రజిని, షాహీన, పల్లవి, సుమ పాల్గొన్నారు. అంతేకాకుండా నడికూడ మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో తానా ఆధ్వర్యంలో అమ్మ, నాన్న, గురువు పద్యార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చిగురుమళ్ల శ్రీనివాస్ రచించిన అమ్మ, నాన్న, గురువు శతకాలు, పద్యాలను కంఠస్థం చేసి 65 మంది సామూహిక గానం చేసినట్లు తానా పూర్వ అధ్యక్షుడు జయశేఖర్ తాళ్లూరి తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం అచ్చ సుదర్శన్, ఉపాధ్యాయులు విజేందర్, శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.